అక్రమ లేఅవుట్లతో పురపాలక ఆదాయానికి గండి

పట్టణంలో అనధికార లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. వాటిని ఆదిలోనే అడ్డుకోవాల్సిన మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో అవి విక్రయించి సొమ్ము చేసుకునేందుకు అక్రమార్కులు సిద్ధమయ్యారు. అనుమతులు లేని లే అవుట్లలో స్థలాలు కొనుగోలు చేసిన వారు ఇంటి నిర్మాణాలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వస్తుంది. అటువంటి వాటిని తక్షణం గుర్తించి నేమ్‌బోర్డులు పెట్టాలని పెడన కౌన్సిల్‌లో తీర్మానం చేసి నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- పెడన పట్టణంలో 43 అనధికార లే అవుట్లు
- కొనుగోలుదారులు మోసపోకుండా నేమ్‌బోర్డులు పెట్టాలి
- మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేసి నెలలు గడుస్తున్నా ఫలితం శూన్యం
- చర్యల విషయంలో మీనమేషాలు లెక్కిస్తున్న అధికారులు

పెడన: పట్టణంలో 43 అనధికార లేఅవుట్లు ఉన్నట్టు పట్టణ ప్రణాళిక విభాగం గుర్తించింది. అనధికార లేఅవుట్లతో మున్సిపల్ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఇలాంటి వాటిని సహించవద్దని, తక్షణం గుర్తించి ఆయా ప్రదేశాల్లో నేమ్ బోర్డులు పెట్టించాలని సీడీఎంఏ కార్యాలయం నుంచి స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. పెడన కౌన్సిల్‌లో కూడా ఈమేరకు అజెండాలో పొందుపరచి ఏకగ్రీవంగా తీర్మానం చేసి ఆమోదించారు. ఈ తీర్మానం ఆమోదించి నెలలు గడుస్తున్నా మున్సిపల్ అధికారుల్లో చలనం లేదు. అదేమంటే మున్సిపల్ అధికారులు, సిబ్బంది బదిలీలతో ఎక్కడి ఫైలు అక్కడే ఉండిపోయిందనే సాకు చెబుతున్నారు. బదిలీల నెపంతో కౌన్సిల్‌లో తీర్మానం చేసిన అంశాన్ని కూడా నెలల తరబడి కాలయాపన చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరిస్తే మున్సిపాలిటీకి రూ.కోట్లలో ఆదాయం లభిస్తుంది. ఈ ఆదాయం రాకుండా కొందరు అడ్డుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.



పెడన బైపాస్ రోడ్డులోని అనధికార లేఅవుట్

కౌన్సిల్‌లో తీర్మానం చేశాం



పట్టణంలో ఎక్కడెక్కడ అనధికార లే అవుట్లు ఉన్నాయో వాటి ముందు నేమ్ బోర్డులు పెట్టాలని కౌన్సిల్‌లో తీర్మానించి ఆమోదించాం. ఈ విషయమై పలుసార్లు అధికారులను అడిగినా బడ్జెట్ లేదని చెప్పడంతో జనరల్ ఫండ్స్ నుంచి రూ.లక్ష కేటాయించాం. అధికారులు, సిబ్బంది బదిలీల కారణంగా జాప్యం అంటున్నారు.

– కటకం ప్రసాద్, సీనియర్ కౌన్సిలర్, 8వ వార్డు

నేమ్ బోర్డులు రెడీ అవుతున్నాయి



జనరల్ ఫండ్స్ నుంచి రూ.లక్ష నిధులు కౌన్సిల్ కేటాయించింది. పట్టణంలో అనధికార లే అవుట్లు ఎక్కడెక్కడ ఉన్నాయో ఇప్పటికే టౌన్‌ప్లానింగ్ వారు గుర్తించారు. వాటి వద్ద నేమ్ బోర్డులు ఏర్పాటు చేయడానికి నేమ్‌బోర్డులు తయారవుతున్నాయి. అవి రాగానే వాటి ముందు పెట్టిస్తాం.

– ఎం.గోపాలరావు, మున్సిపల్ కమిషనర్, పెడన

సాబూజాన్‌కు డాక్టరు అబ్దుల్ కలాం జాతీయ పురస్కారం

బంటుమిల్లి: స్థానిక సెయింట్ జాన్స్ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల డైరెక్టరు సాబూజాన్ దివంగత రాష్ట్రపతి డాక్టరు ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. గుంటూరు ఏసీ కాలేజీలో సదరన్ ప్రైవేటు లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో సాబూజాన్ ఈ పురస్కారం అందుకున్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అబ్దుల కలాం అవార్డు, ప్రతిభ పురస్కారం అందించి అభినందించారు. గ్రామీణ ప్రాంతంలో విద్యాభివృద్ధికి చేస్తున్న కృషిని అభినందిస్తూ ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఆర్గనైజేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థి, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఫోన్ చేసి సాబూజాన్ మాస్టారుకు అభినందనలు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, స్నేహితులు, తల్లిదండ్రులు పలువురు సాబూజాన్‌కు అభినందనలు తెలిపినవారిలో ఉన్నారు.







డాక్టరు ఏపీజే అబ్దుల్‌కలాం జాతీయ పురస్కారం అందుకున్న సాబూజాన్ మాస్టారు, సయ్యద్ అహ్మద్ ఉమరి మదిని , గౌరీప్రసాద్

సయ్యద్ అహ్మద్‌కు కలాం అవార్డు

పెడన: పెడన పట్టణానికి చెందిన మర్కజ్ దారుల్బిర్ ట్రస్టు చైర్మన్, ఫౌండర్ డాక్టర్ సయ్యద్ అహ్మద్ ఉమరి మదిని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా అవార్డు అందుకున్నారు. సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ అండ్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు ఏసీ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అవార్డును అందజేశారు.

గౌరీ ప్రసాద్‌కు డాక్టర్ అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా అవార్డు

పెడన: పట్టణానికి చెందిన ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, స్థానిక విశ్వభారతి హైస్కూలు ప్రిన్సిపాల్ ఎ.గౌరీ ప్రసాద్ డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం జాతీయ ప్రతిభా అవార్డు అందుకున్నారు. సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ అండ్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు ఏసీ కాలేజీలో జరిగిన ఈ కార్యక్రమంలో గౌరీప్రసాద్ ఈ అవార్డును ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు చేతుల మీదుగా అందుకున్నారు. అవార్డు అందుకున్న గౌరీప్రసాద్‌కు అప్సా నాయకులు, స్థానిక విశ్వభారతి హైస్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పట్టణానికి చెందిన పలువురు అభినందనలు తెలిపారు.

నేత్ర వైద్య శిబిరంలో 700 మందికి పరీక్షలు

పెడన: మండల పరిధిలోని దావోజిపాలెం గ్రామంలో అశ్విని ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీవిజయ అమలేశ్వరి దేవస్థానం కమిటీ సభ్యుల నేతృత్వంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పెడన పరిసర ప్రాంతాల నుంచి సుమారు 700 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 350 మందికి కళ్లజోళ్లు అవసరమని సూచించారు. మరో వంద మందికి శస్త్రచికిత్సలు తప్పనిసరి చేయించుకోవాలని తెలిపారు. 650 మందికి పైగా కంటి లోపాలున్న వారికి ఉచితంగా మందులను అందజేశారు. విజయవాడ చైతన్య కంటి ఆసుపత్రికి చెందిన ప్రముఖ వైద్యులు అంకెం శ్రీనివాస్, గీతా శ్రీనివాస్, చైతన్య, అరవింద్, నిఖిల మీనాక్షి వైద్య సేవలందించారు. అశ్విని ఫౌండేషన్ సభ్యులు పి.రాజశేఖర్, పడాల రమేష్, సలీంబాబు, నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు, హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు శిబిరంలో సేవలను అందించారు. శ్రీవిజయ అమలేశ్వరిదేవి దేవస్థానం కమిటీ సభ్యులు, అంకెం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఉచిత నేత్ర వైద్య శిబిరంలో నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సుదర్శి నేతృత్వంలో 80మందికి నేత్ర పరీక్షలు

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆసుపత్రి(పెదకాకాని) సహకారంతో సుదర్శి మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ప్రజాసంఘాల నాయకుడు తలశిల లీలామనోహర్ ప్రారంభించారు.తలశిల శ్రీరాములు, ఉప్పల వెంకయ్య, కనిగంటి అంకినీడు జ్ఞాపకార్థం వారి కుటుంబీకుల ఆర్థిక సౌజన్యంతో స్థానిక మారుతీ విద్యానికేతన్ డిజిటల్ స్కూలు ప్రాంగణంలో నిర్వహించిన ఈ శిబిరంలో 80 మందికి డాక్టర్ శ్రావణి నేత పరీక్షలు చేశారు. వీరిలో 53 మందిని ఐఓఎల్ ఆపరేషన్ (కంటి లోపల అద్దం అమరిక)కు ఎంపిక చేసి ఉచిత శస్త్ర చికిత్సల నిమిత్తం బస్సులో శంకర కంటి ఆసుపత్రికి పంపించారు. సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కనిగంటి వెంకట నారాయణ, ఆసుపత్రి క్యాంప్ ఇన్‌చార్జి గంగాధర్ పాల్గొన్నారు.



వృద్ధులకు నేత్ర పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రావణి

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మచిలీపట్నంటౌన్: వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 14 మంది లబ్ధిదారులకు రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆదివారం రూ.29.35 లక్షల చెక్కులను మంత్రి నివాసంలో అందించారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, డివిజన్ ఇన్చార్జిలు పాల్గొన్నారు.

రీసర్వే గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి

ఘంటసాల: రీ సర్వేలో కారణంగా ఏర్పడిన సమస్యలను పరిష్కరించుకోవడానికి ఏర్పాటు చేస్తున్న గ్రామ సభలను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ కోరారు. ఈనెల 22 నుంచి 30 వరకు మండలంలో రీ సర్వే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

రేపటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

మోపిదేవి: మండలంలో భూ సర్వే పూర్తయిన గ్రామాల్లో ఈనెల 22 నుంచి 30వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీ విద్య తెలిపారు. ఈ గ్రామసభల్లో విస్తీర్ణాల్లో వ్యత్యాసం, భూమి క్లాసిఫికేషన్, తప్పుల సవరణ, ఇతర సంబంధిత సమస్యల పరిష్కారం ఉంటుందని తెలిపారు.

క్రీమీలేయర్‌తో రిజర్వేషన్ల మనుగడకే ప్రమాదం

కోనేరుసెంటర్: ఎస్సీ వర్గీకరణ అడిగితే క్రీమీలేయర్‌ను తెరమీదకు తెచ్చారని, దీని వలన రిజర్వేషన్‌ల మనుగడకే ప్రమాదం ఏర్పడిందని దళిత సంఘ నాయకులు పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని చినయాదర, పెదయాదర గ్రామాలలో ఆదివారం పర్యటించిన దళిత సంఘాల నాయకులు క్రీమీలేయర్ అమలు చేయటం వలన కలిగే నష్టాలపై ఆయా గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. దళితులు ఐక్య ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. దళితుల రిజర్వేషన్‌లను అణచివేసేలా చేస్తున్న కుట్రలను ధైర్యంగా ఎదుర్కోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సునీల్‌కుమార్, విశ్రాంత మండల విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు, బహుజన సమాజ్ పార్టీ నాయకులు విజయ్, రాజా తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

ఘంటసాల: అర్హులైన పట్టభద్రులు ఓట్లు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ కోరారు. ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నవంబర్ 6వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గార్మి వేడుకలు



గూడూరు: హజ్రత్ గౌసే ఆజం దస్తగిర్ సంస్మరణ వేడుకలలో భాగంగా గూడూరు మండలం ఆకులమన్నాడులో ఆదివారం గార్మి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక మహబూబ్ సుభాని జెండాలో నిర్వహించిన వేడుకలలో భాగంగా గుంటూరుకు చెందిన మత గురువు మౌలానా సమీఉజ్ జమా హజ్రత్ గౌసేయాసం జీవిత సందేశాన్ని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా జెండా ఆవరణలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ప్రార్థనలో పాల్గొని ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎండీ రఫీ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఫైజుల్ రెహమాన్(మున్నా), కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం

మెరకనపల్లి(మోపిదేవి): మండల పరిధిలోని మెరకనపల్లి గ్రామంలో ఆదివారం పల్లెపండుగ.. పంచాయతీ వారోత్సవాలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి ధనరాజ్యలక్ష్మి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. గ్రామంలో రూ.18.20 లక్షలతో నాలుగు సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి శ్రీకారం చుట్టినట్టు సర్పంచ్ తెలిపారు. మండల వైస్ ఎంపీపీ నడకుదుటి జననీకుమారి, మాజీ సర్పంచ్ అంబటి శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు నడకుదుటి జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్వచ్ఛ బందరుగా తీర్చిదిద్దుదాం



మచిలీపట్నం టౌన్ : శ్రమదానం ద్వారా మచిలీపట్నం నగరాన్ని స్వచ్ఛ బందరుగా తీర్చిదిద్దడానికి ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. కూటమి నాయకులు, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ఆదివారం మంత్రి స్థానిక పంపులచెరువు పరిసర ప్రాంతాలలో శ్రమదానం కార్యక్రమం చేపట్టారు. మూడు స్తంభాల సెంటర్ నుంచి పాత పంపుల చెరువు గట్టుమీద పెరిగిపోయిన పిచ్చి మొక్కలు, ముళ్లపొదలతో అల్లుకుపోయిన చెరువుగట్టును శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నా బంగారు బందరు-స్వచ్ఛ బందరు కోసం శ్రమదానం కార్యక్రమానికి ఆదివారం శ్రీకారం చుట్టామని చెప్పారు. నగరంలో ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలతో పాటు బహిరంగ ప్రదేశాలను పరిశుభ్రం చేసుకోవడానికి ఒక పూట శ్రమదానం చేయడం ద్వారా బందరును స్వచ్ఛ నగరంగా మార్చగలమన్నారు. నగరంలో లక్ష టన్నులకు పైగా పేరుకుపోయిన చెత్త తొలగింపునకు రూ.12 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని, డ్రైనేజీ నిర్మాణం ఇతర అభివృద్ధి పనులకు రూ.75 నుంచి రూ.100 కోట్లతో అంచనాలను తయారుచేసి ప్రభుత్వానికి నివేదించామన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, కూటమి నాయకులు బండి రామకృష్ణ, మాదివాడ రాము, సోడిశెట్టి బాలాజీ, కార్పొరేటర్లు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

కార్తికేయుని సన్నిధిలో దేవదాయ అసిస్టెంట్ కమిషనర్



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని దేవదాయ ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ తెనాలి చంద్రకుమార్ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకుడు బుద్ధు సతీష్ శర్మ స్వామివారికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ డీసీ దాసరి శ్రీరామ వరప్రసాదరావు స్వామివారి చిత్రపటం, లడ్డుప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా శివనాగేశ్వరరావు



నాగాయలంక: మండల ఆర్యవైశ్యసంఘం నూతన అధ్యక్షుడుగా చిట్టా శివనాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా చిట్టా వీర అన్నపూర్ణయ్య, కోశాధికారిగా కొల్లూరు రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడిగా తూనుగంట్ల శేషుబాబు, ప్రధాన కార్యదర్శిగా విస్సంశెట్టి హరీష్, కోశాధికారిగా చన్నగిరి నారాయణ, వాసవీ సేవాదళ్ కన్వీనర్‌గా వంకాయల రాజేష్(ఆది), కోకన్వీనర్‌గా చిట్టా వెంకట శేఖరరావు, కోఆర్డినేటర్ మామిడి రాజగోపాల్‌లను ఎన్నుకున్నారు. స్థానిక కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన ఎన్నిక కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సన్నిధి నాగసాయి శ్రీనివాస్, ఆర్యవైశ్యరత్న చిట్టా సాంబశివరావు పర్యవేక్షణలో ఎన్నికల అధికారి ఘంటసాల రాజమోహన్ కన్నయ్య ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు జరిగాయి.

హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి రూ.5లక్షల విరాళం



చల్లపల్లి(అవనిగడ్డ): స్వచ్ఛ సుందర చల్లపల్లి ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తున్న హిందూ శ్మశాన వాటికకు గ్రామ ప్రముఖుడు సజ్జా చలపతి రావు రూ.5లక్షల విరాళాన్ని అందించారు. హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి కోసం ఆయన గతంలో రూ.5లక్షలు విరాళం అందించగా, ఆదివారం మరో రూ.5లక్షల విరాళాన్ని శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ ద్వారా స్వచ్ఛసుందర చల్లపల్లి నిర్వాహకులు డాక్టర్ డీఆర్‌కె ప్రసాద్- డాక్టర్ పద్మావతి దంపతులకు అందించారు. ఈ సందర్భంగా చలపతి రావుని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, డాక్టర్ డీఆర్‌కే దంపతులు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి అభినందించారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

కార్మికులకు యూనిఫాం పంపిణీ చేసిన మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నంటౌన్: రోజువారీ విధులు సక్రమంగా నిర్వర్తించడమే కాకుండా ఉమ్మడి కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఇటీవల కురిసిన వర్షాలు, సంభవించిన వరదల్లో మచిలీపట్నం నగరపాలక సంస్థ పారిశుద్ధ్య కార్మికులు అందించిన సేవలు వెలకట్టలేనివని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఇటీవల విజయవాడ వరదల్లో మచిలీపట్నం నుంచి వెళ్లి బాధితులకు విశేష సేవలు అందించిన 250 మంది పారిశుద్ధ్య కార్మికులకు ఆదివారం నగరంలోని పంపుల చెరువు వద్ద రూ.5 లక్షల విలువైన యూనిఫామ్ జతలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ ఇటీవల విజయవాడ వరదల్లో సేవలందించిన మచిలీపట్నం నగరానికి చెందిన 250 మంది పారిశుద్ధ్య కార్మికులు సేవలందించారని, వారి సేవలకు గుర్తింపుగా ఈ యూనిఫాంలే కాకుండా, త్వరలో తన వంతుగా ప్రతి ఒక్కరికీ నాణ్యమైన పాదరక్షలు అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్య శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. మచిలీపట్నం మునిసిపాలిటీ దేశంలోనే రెండవదని, అలాంటి పురాతనమైన, విశిష్టత కలిగిన నగరాన్ని నా బంగారు బందరు కోసం శ్రమదానం కార్యక్రమంతో స్వచ్ఛ బందరుగా, ఆదర్శ నగరంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మంత్రి కోరారు. నగరంలోని డంపింగ్ యార్డులో లక్ష టన్నులకు పైగా చెత్త పేరుకుపోయిందని, రానున్న మూడు నుంచి ఆరు నెలల్లో ప్రత్యేకంగా కేటాయించిన నిధులతో తరలింపునకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆ స్థలంలో ఒక సుందరమైన పార్కును నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ బాపిరాజు, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, స్థానిక నాయకులు మాదివాడ రాము, వెంకట్రావు, నాగబాబు, కార్పొరేటర్లు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం అందజేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

క్షేత్రస్థాయిలో ప్రజలకు సేవలు అందించాలి

మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నంటౌన్: క్షేత్రస్థాయిలో ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకు కృషి చేయాలని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. నగరంలోని మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద ఆదివారం నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయ అడ్మిన్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ పింఛన్ల పంపిణీలో సచివాలయ ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమైందని, పింఛన్ల పంపిణీ సజావుగా సాగేందుకు వారు ఎంతో కృషి చేస్తున్నారని మంత్రి అభినందించారు. సచివాలయానికి అడ్మిన్ నాయకుడు లాంటివాడని, సచివాలయంలోని మిగిలిన సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ బందరు అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. బందరును ఒక ఆదర్శ నగరంగా తీర్చిదిద్దడానికి నా బంగారు బందరు కార్యక్రమంతో శ్రీకారం చుట్టామని, నగరంలోని ప్రతి డివిజన్‌ను స్వచ్ఛ డివిజన్‌గా తయారు చేయడానికి ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామని, ఆ దిశగా సచివాలయ ఉద్యోగులు పనిచేయాలని సూచించారు. ప్రతి సచివాలయ ఉద్యోగి వారి పరిధిలో ప్రతిరోజు క్షేత్రస్థాయిలో సందర్శించి ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు, అంగన్వాడీ, మున్సిపాలిటీ పాఠశాలలకు మరమ్మతులు చేపట్టడానికి అవసరమైన నిధులను సమకూరుస్తామన్నారు. సమావేశంలో కార్పొరేషన్ కమిషనర్ బాపిరాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, కూటమి నాయకులు బండి రామకృష్ణ, ఇలియాజ్ బాషా, పల్లపాటి సుబ్రహ్మణ్యం, తలారి సోమశేఖర్, పలువురు కార్పొరేటర్లు, సచివాలయ అడ్మిన్లు పాల్గొన్నారు.



సచివాలయ అడ్మిన్‌లతో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

శిథిల భవనాల్లో విద్యార్థులను ఉంచొద్దు

వసతి గృహాలను తనిఖీ చేసిన సీనియర్ సివిల్ జడ్జి

అవనిగడ్డ: పురాతన శిథిల భవనాల్లో విద్యార్థులను ఉంచొద్దని, స్కూల్స్, కాలేజీలకు విద్యార్థులు వెళ్లేటప్పుడు వెంట వసతి గృహ అధికారులు ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి బాబూ నాయక్ ఆదేశించారు. రాష్ట్ర న్యాయాధికార సంస్థ ఆదేశాల మేరకు ఆదివారం స్థానిక రెండో వార్డులోని బీసీ బాలికల కాలేజీ వసతిగృహం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెనుక ఉన్న ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న వసతులు, మెనూని అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, మరుగుదొడ్ల పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. వైద్య సేవల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. 1971లో నిర్మించిన గదులు శిథిలావస్థకు చేరాయని వాటిలో విద్యార్థినులను ఉంచొద్దని ఆదేశించారు. బాలుర వసతి గృహంలో మరో భవనం పెచ్చులూడి ప్రమాదకరంగా ఉందని అందులోనూ విద్యార్థులను ఉంచొద్దని చెప్పారు. విద్యార్థులు స్కూల్స్‌కు, కాలేజీలకు వెళ్లేటప్పుడు వసతి గృహ అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాదులు నరహరిశెట్టి ఈశ్వర రావు, చిట్టిప్రోలు ప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సనకా రఘురాంప్రసాద్, న్యాయవాది దామెర్ల నాగరాజు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబూ నాయక్

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

బంటుమిల్లి: రాష్ట్రంలోని ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తోందని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. పల్లెపండుగ-పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మండల పరిధిలోని కొర్లపాడు, అర్తమూరు గ్రామాల్లో కాగిత పర్యటించారు. ఈ సందర్భంగా కొర్లపాడు గ్రామంలో రూ.30 లక్షలు, అర్తమూరు గ్రామంలో రూ.25 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు ఆయన భూమి పూజలు చేసి శిలాఫలకాలు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన గ్రామ సభల్లో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, అంతర్గత డ్రైనేజీలు, శ్మశానాల్లో సౌకర్యాల ఏర్పాటుకు నిధులు కేటాయిస్తున్నామన్నారు. జేజేఎం నిధులతో గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారం కోసం పనులు వేగవంతం చేయిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ అట్లూరి రమేష్, టీడీపీ మండల అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు, పలు గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనమెరుపు : ప్రభుత్వ కార్యక్రమం అయినప్పటికీ ఆదివారం కావడంతో అధికారులు అందరూ కార్యక్రమానికి డుమ్మా కొట్టడం గమనార్హం.



కొర్లపాడు గ్రామంలో సీసీ రోడ్ల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

రేపటి నుంచి ఆధార్ క్యాంపులు

ఘంటసాల: ప్రజల సౌకర్యార్థం ఘంటసాల మండలంలో ఏర్పాటు చేస్తున్న ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో డి.సుబ్బారావు అన్నారు. ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు మండలంలో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.